అన్ని విషయాలలోనూ దీక్ష కలిగి ఉండాలి. విషయగ్రహణంలో ఉత్కృష్టతను ప్రదర్శించడమే కాకుండా విద్యాలయాలలోని ఇతర కార్యకలాపాలన్నిటిలోనూ విద్యార్థులు విశేషంగా పాల్గొనాలి. ఒక్క మాటలో చెప్పాలంటే విద్యార్థులు కళాశాలా జీవితం తమకు ఇచ్చే అవకాశాలన్నిటినీ పూర్తిగా, సక్రమంగా వినియోగించుకోవాలి.

ప్రజలు విద్యావిధానంలో ఔదాసీన్యం త్యజించాలి. తమ పిల్లలు భారతదేశంలో పౌరసత్వ విధులను సక్రమంగా నిర్వర్తించడానికి సరియయిన పునాదులను నిర్మించడానికి పూనుకోవాలి. విద్యాలయాల స్థితిగతులూ, విద్యార్థుల అభివృద్ధీ నిరంతరం పరిశీలిస్తూ సరియైన అవకాశాలనూ, సౌకర్యాలనూ కలుగచెయ్యడానికి విద్యాలయాధికారులనూ, ప్రభుత్వాన్నీ తరచు హెచ్చరిస్తూ ఉండాలి.

ప్రభుత్వం విద్యావిషయాలలో కేవలం ఔదాసీన్యం మాత్రమే కాకుండా పూర్తిగా నిరాదరణ చూపించడం శోచనీయం. ఆర్థిక విపత్తు, రాజకీయ విపత్తూ తమ ప్రభావాన్ని వెంటనే కనబరుస్తాయి. విద్యావిధానంలోని క్షీణతవల్ల కలిగే నష్టాలు అంత త్వరగా ప్రస్ఫుటంగా కనిపించవు. నిజానికి విద్యావిధాన పునర్నిర్మాణము అన్ని సమస్యలకంటె కూడా ముఖ్యమైనది. విద్యాలయాలకు ఆర్థిక సహాయం చెయ్యడం అధ్యాపకులకు జీవిత సౌకర్యాలను వృద్ధిచెయ్యడం, విద్యార్థులకు విజ్ఞానాభివృద్ధికి సౌకర్యాలను కల్పించడం, ప్రజలలో విజ్ఞానానికీ చైతన్యానికీ దోహదం ఇయ్యడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల కనీస కర్తవ్యం. ఈమధ్య డా॥ రాధాకృష్ణన్ అధ్యక్షత క్రింద విశ్వవిద్యాలయ సంఘ నియామకం జరిగినది. ఆ సంఘం తన నివేదికను ఈ సంవత్సరాంతంలోగా ప్రకటించనున్నది. ఆ నివేదికలో ఉండే సూచనలను కార్యరూపంలోకి అనువదించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి.

గల్పిక

# “దేశమును ప్రేమించుమన్నా!”

ఎస్. నటరాజన్

సామాన్యుడు దేశభక్తికోసం పెద్ద బజారంతా వెతికాడు. అంతా బ్లాకుమార్కెట్టు. ఎక్కడా దొరకలేదు. అతను దేశభక్తుణ్ణి వెతికిపట్టుకుని అడిగాడు, ఎక్కడ దొరుకుతుందని. దేశభక్తుడు ఖద్దరు టోపీ చేతిలోకి తీసుకుని సామాన్యుణ్ణి అనుమానంగా ఒకసారి ఎగాదిగా పరకాయించి చూసి. ‘నువ్వు ఏ ఇజం’ అని అడిగాడు. సామాన్యుడు ‘నేను ఏ ‘ఇజమూ’ ఎరగనే!’ అన్నాడు అమాయకంగా అతనికి ఆశ్చర్యంగా ఉంది ఆ ఇజం ఏమిటోనని. దేశభక్తుడు శాంతించిన హృదయ స్పందనానికి గుర్తుగా ఖద్దరు టోపీ నెత్తిన పెట్టుకుని, ‘అయితే చిన్న బజారు స్వదేశవస్తు విక్రయశాలలో దేశభక్తి కంట్రోలు రేటుకి అమ్ముతున్నారు. అక్కడికి వెళ్లు, దొరుకుతుంది’ అని చెప్పి వెళ్లిపోయినాడు.

సామాన్యుడు దేశభక్తికి మూల్యం తెలియక ఇదివరకే అవస్థపడ్డాడు గాబట్టి స్వదేశవస్తువిక్రయశాలలో ప్రవేశిస్తూనే పది రూపాయలనోటు చేత పుచ్చుకుని విక్రయశాలయజమాని త్యాగశీలంగారిని కనుక్కున్నాడు ‘ఓ సవాశేరు దేశభక్తి ఎంత’అని

త్యాగశీలంగారు, ఇంకెవ్వరికో అప్పుడే ‘దేశసేవ’ ఇచ్చి, సామాన్యుడి వంక చూసి, ‘ఇంకా తెలీదుటయ్యా దేశభక్తి ధర?’ అని గదమాయించాడు.

‘తెలీకనే కదండి అడుగుతూంటా!’ అన్నాడు సామాన్యుడు కాస్త లజ్జపడి.

‘నువ్వు వడికిన నూలు వీశెడు తెస్తే, సవాశేరు దేశభక్తి ఇస్తాం. అదిగో బోర్డు రాసి లేదుటయ్యా? చూడు కావలిస్తే.’

‘బోర్డు చూశానండి. ఆ అక్షరాలేవో బోధపడ్లేదు లెండి. అయినా, నాకు నూలు వడికే తీరిక లేదే. నాకు దేశభక్తి లేనట్టేనా?’ సామాన్యుడు. బాధగా, ఆశ్చర్యంతో కనుక్కున్నాడు.

‘మంచి బేరమే తెచ్చావయ్యా మహానుభావా! హిందీబోర్డు తెలీదంటున్నావు. నూలు వడక లేనంటున్నావు, పదపద’ అన్నాడు త్యాగశీలం గారు చిరాకుగా. సామాన్యుడు తలగోక్కుంటూ కొంప చేరుకున్నాడు!